## ప్రవాసాంధ్ర కథ

# పోలీసాయన

**జె.యు.బి.వి.ప్రసాద్**

ప్రతీ ఆదివారం పొద్దున్నే హాస్పిటల్‌కి పరుగెత్తుకెళ్ళి, పేషంట్సుకీ, నర్సులకీ సంఘసేవ చేసేస్తూ వుంటాను. ఈ సంఘసేవలో ముఖ్య భాగం పేషంట్లతో మాట్లాడ్డం, వాళ్ళని ఓదార్చడం, వాళ్ళకి కావల్సినవి ఇవ్వడం. ఈ పనులు మొదలుపెట్టిన కొత్తరోజుల్లో నాకు నేనే ఒక దేవదూతగా, తలవెనుక కాంతిచక్రాలతో కనిపించేవాడిని.

ఆ రోజు మామూలుగానే మదర్ థెరిస్సా మనవడిలా హాస్పిటల్‌లో అడుగుపెట్టాను ప్రజాసేవ కోసం.

రిజిస్టరులో పేరు రాసి, ఫ్రంట్ డెస్క్ దగ్గరకి వెళ్ళేటప్పటికి ఒక పోలీసాయన రిసెప్షనిస్ట్‌తో మాట్లాడుతూ కనబడ్డాడు.

హాస్పిటల్ ఎమర్జెన్సీ రూమ్‌లో పోలీసు!!

ఆ పోలీసు నడుం దగ్గర తుపాకీ వుందా అని చూసాను.

అమ్మో వుంది! తుపాలకులంటే ఎంత భయమో నాకు!

పొరపాటున పేలితే ఇంకేమన్నా వుందా!

ఆ మధ్యకాలంలో మా స్నేహితుల పక్క అపార్ట్‌మెంటులో ఎవ్వరూ లేనప్పుడు, ఒక బీరువా మీద పెట్టిన తుపాకీ జారి, కిందపడి పేలింది. ఆ గుండు మా స్నేహితుల అపార్టుమెంటులోకి గోడగుండా దూసుకువచ్చింది. మా వాళ్ళు భయపడి, పోలీసులని కూడా పిలిచారు. వెంటనే మా ఇంటికి ఆ రాత్రే వచ్చేసి, మళ్ళీ వేరే అపార్టుమెంటు దొరికేవరకూ వెళ్ళలేదుభయంతో.

అక్కడే వున్న ఒక నర్సుని పలకరించి, పోలీసాయన సంగతేమిటని అడిగాను.

'ఇప్పుడే ఒక పేషంట్ ముక్కు మీదా, నోటి మీదా గాయాలతో రక్తం కార్చుకుంటూ వచ్చాడు. ఏమయిందని రొటీన్‌గా అడిగితే, తన భార్య కోపంతో ఫోను పట్టుకుని మొహం మీద కొట్టిందని చెప్పాడు. వెంటనే మా రూల్సు ప్రకారం పోలీసులకిఫోన్‌చేసి చెప్పాం. ఆ పోలీసాయన ఆ విషయం గురించే రిసెప్షనిస్టుతో మాట్లాడుతున్నాడు'. నర్సు చాలా మామూలుగా రిపోర్టిచ్చింది.

ఈ నర్సులకి ఇలాంటివన్నీ అలవాటయి పోయి వుంటాయి, పాపం. ఎటువంటి ఎమోషనూ లేకుండా మాట్లాడేస్తారు. ఎంత మెకానికల్‌గా అయిపోతారో!

ఒక వారం కిందట, డస్ట్‌బిన్ తగిలి, చూపుడువేలికి చిన్న గాయం అవడంవల్ల పావుచుక్క రక్తం కారితే, ఒక చిన్న బాండేజ్ అడిగాను. దాంతోపాటు యాక్సిడెంట్ రిపోర్టు ఫామ్ కూడా ఇచ్చింది ఆ నర్సు. రూల్స్ ప్రకారం పూర్తి చేయాలంటూ, లేకపోతే నేను హాస్పిటల్ మీద దావా వేయచ్చట.

వాలంటీరుగా వున్నా హాస్పిటల్‌లో ఉద్యోగి లాగే లెఖ్ఖ కొన్ని విషయాల్లో. పని స్థలంలో ఏదన్నా యాక్సిడెంట్ జరిగితే హాస్పిటల్‌కి చట్ట ప్రకారం బాధ్యత వుంటుంది. అందుకోసమని ముందరే జాగ్రత్తగా అన్ని విషయాలూ రికార్డు చేసుకుని అట్టేపెట్టుకుంటారు.

వెంటనే అక్కడ నుండి పారిపోయి, ఇంటికి వెళ్ళేవరకూ ఆ నర్సుకి కనబడకుండా నక్కుతూ, నక్కుతూ తిరిగాను.

గబగబా ఆ దెబ్బ తగిలిన పేషంటు రూమ్‌లోకి నడిచాను. ఒక నలభై అయిదేళ్ళు



వుంటాయి ఆ పేషంటుకి. ఎర్రటి టీ షర్టూ, కాకీరంగు నిక్కరూ వేసుకున్నాడు. తెల్లటి సాక్సూ, బ్రౌన్‌కలరు షూసూ, పై పెదవి చిట్లి రక్తం వస్తోంది. ముక్కుదూలం నుంచి కూడా రక్తం కారుతోంది. నర్సు ఇచ్చిన గాజ్‌తో అదిమిపెట్టి, రక్తస్రావాన్ని ఆపుకుంటూ బెడ్‌మీద కూర్చున్నాడు.

నన్ను చూడగానే డాక్టరనుకుని, సర్దుకుని కూర్చుని, ముక్కూ, మూతీ చూపించాడు.

నా అవతారం చూసి, కొంతమంది అమాయక పేషంట్లు నేనే డాక్టరు అనుకుని వాళ్ళ కష్టాలు చెప్పేసుకుంటూ వుంటారు. డాక్టరుని కాను వాలంటీరుని అని చెప్పగానే నోరు బిగించేసుకుని అవమానంగా ఫీలయిపోతారు. ఆ తరువాత అలాంటి వాళ్ళ చేత మాట్లాడించేసరికి నాకు నిజంగానే డాక్టరయి పోయినంత ఫీలింగు కలిగేది.

పాపం, ఏమాటకామాటే చెప్పుకోవాలి.

నేనెవరో చెప్పాక కూడా ఈ పేషంటు ఏమీ ఫీలవకుండా నవ్వుతూ చూసాడు నావైపు.

కొంచెమంటే కొంచెం సంతోషం కలిగింది నా కష్టం తగ్గినందుకు.

'ఏమయింది?' అని అడిగాను.

'నాకూ, నా భార్యకీ గొడవయింది. ఆవిడ దగ్గర్లో వున్న ఫోను తీసుకుని మొహంమీద కొట్టింది. బాగా రక్తం కారుతుండటంవల్ల ఏమవుతుందోనని భయంవేసి వెంటనే ఎమర్జెన్సీ రూమ్‌కి వచ్చాను.' గబగబా చెప్పాడు.

'నీకూ, నీ భార్యకీ ఎందుకు గొడవ జరిగింది? నీకభ్యంతరం లేకపోతేనే చెప్పు" అడిగాను మంచిగా.

'మేం నెక్స్ట్ మంత్ శలవులకి న్యూయార్క్ వెళదామని ప్లాను వేసుకున్నాం. అక్కడ మా పేరెంట్సు వున్నారు. నార్త్ కెరోలీనాలో వున్న నా సిస్టర్ ఫోను చేసింది ఈరోజు పొద్దున్న. నా సిస్టర్ ఫోన్ చేసినప్పుడు నేను బాత్‌రూమ్‌లో వున్నాను. అందువల్ల నా భార్య ఫోను తీసుకుని మాట్లాడ్డం మొదలుపెట్టింది. కాసేపటికి నేను బయటకి వచ్చాను. వాళ్ళిద్దరి మధ్య ఏదో గొడవ మొదలయింది అప్పటికే. నా భార్య ఫోనులో అరవడం మొదలుపెట్టింది. ఆపుదామని ప్రయత్నించాను. కుదరలేదు. నా భార్య ఫోను పెట్టేసాక, ఎందుకనవసరంగా నా సిస్టర్‌తో గొడవ పడతావు అనడిగాను. అంతే! నా భార్యకి చాలా కోపం వచ్చేసింది. అందుబాటులో వున్న ఫోను తీసుకుని నా మొహం మీద కొట్టింది' వివరంగా చెప్పేసాడు.

'మీకు పిల్లలున్నారా?' అడిగాను.

'ఇద్దరబ్బాయిలున్నారు. ఇది జరుగుతున్నప్పుడు వాళ్ళక్కడే వున్నారు. వాళ్ళిద్దరినీ వాళ్ళమ్మకి కాపలాగా పెట్టి నేనిక్కడకి వచ్చాను. వాళ్ళమ్మ ఆవేశంలో ఇంకేమీ చేయకుండా వాళ్ళని చూసుకోమన్నాను.' గొంతుకలో ఎంతో వ్యథతో చెప్పాడు.

కొంత అర్థం అయీ, కొంత అవకా వున్నట్లనిపించింది.

ఎలాగూ అడిగినవాటికన్నిటికీ జవాబు చెబుతున్నాడు కదా అని, 'నువ్వు మీ ఆవిడ మీద చార్జెస్ ప్రెస్ చేయబోతున్నావా?' అని అడిగేసాను వుండబట్టలేక.

'లేదు, లేదు. నేనేమీ కంప్లైంట్ చేయడం లేదు. ఇది మా ఇంటి గొడవ. మేమే సర్దుకుంటాం' అన్నాడు స్వాభిమానం చూపిస్తూ.

'మరి పోలీసులొచ్చారు ఇక్కడికి తెలుసా?' అడిగాను.

'నాకు తెలియదు. ఆ నర్సు ఏం జరిగిందీ అని అడిగితే నిజాయితీగా జరిగినదంతా చెప్పాను. పోలీసులని పిలవమని నేను చెప్పలేదు' అన్నాడు గబగబా.

నాకు కొంచెం జాలివేసింది ఆ మనిషి మీద.

నేను ఏదో చెబుదామని నోరు తెరిచేటప్పటికి, ఆ పోలీసాయన గదిలోకి వచ్చేసాడు. పోలీసాయన్ని చూసి నోరు మూసుకుని పక్కగా నుంచున్నాను.

ఆ పోలీసాయన ముందరగా నా చొక్కాకున్న బాడ్జ్ చదివి తల పంకించాడు. అతని నడుం దగ్గర వున్న తుపాకీ చూడగానే కాళ్ళలో వణుకు మొదలయింది. అకస్మాత్తుగా పేలుతుందేమోనని వుండుండి దానివైపే చూడసాగాను. ఒక కన్ను ఆ తుపాకీ మీద వేసి, ఇంకో కన్నుతో వాళ్ళిద్దరినీ చూస్తూ, వాళ్ళ మాటలు వినసాగాను.

పోలీసాయన, 'ఏంజరిగింది?' అని అడిగాడు.

పేషంటు మొత్తం కథంతా తూ.చా. తప్పకుండా చెప్పేసాడు.

నాకు గుండెల్లో గుబులు మొదలయింది.

పోలీసాయన పేషంటు డేటాఫ్‌బర్తూ, సోషల్ సెక్యూరిటీ నంబరూ, ఇంటి అడ్రస్సూ, ఇంటి ఫోనునెంబరూ, భార్య పూర్తి పేరూ, భార్య డేటాఫ్‌బర్తూ, భార్య సోషల్ సెక్యూరిటీ నంబరూ అన్నీ అడిగాడు.

పేషంటు తడుముకోకుండా అన్నింటికీ సమాధానం చెప్పేసాడు.

పోలీసాయన అన్నీ నోట్‌బుక్‌లో రాసేసుకున్నాడు.

అప్పటికి పేషంటుకు రక్తస్రావం ఆగింది.

పోలీసాయన అడగని వివరంలేదు.

పేషంటు చెప్పని వివరం లేదు.

నా గుండెల్లో గుబులు పెరగకుండా తగ్గనూ లేదు.

ఈ లోపల పోలీసాయన వంటి మీద వున్న రేడియోలోంచీ ఏవో చప్పుళ్ళు వచ్చాయి. ఆ చప్పుళ్ళు ఆ పోలీసాయనకి మాత్రమే అర్థం అయ్యాయి.

'ఎక్స్క్యూజ్‌మీ' అంటూ బయటకి వెళ్ళి, మెడ ఒంచి, భుజం దగ్గరున్న రేడియో మైకులో ఏదో మాట్లాడసాగాడు.

సందు దొరికిందని నేను మాట్లాడ్డం మొదలుపెట్టాను.

'ఎందుకా వివరాలన్నీ పోలీసాయనకి చెప్పావు?' గబుగబా వర్రీగా అడిగేసాను పేషంటుని.

'మరి నిజాయితీగా అన్నీ చెప్పాలి కద?' నాదేం తప్పు అన్నట్లు చూసాడు.

నీ నిజాయితీ మండినట్లే వుంది అని అనుకున్నాను.

'అన్ని విషయాలూ చెప్పాక కూడా ఆ పోలీసాయన నీ భార్యని అరెస్టు చేయకుండా వదులుతాడా? ఇది మీ ఇంటి విషయంగానే వుంచదలుచుకున్నవాడివి ఈ విషయాలేవీ ఎవరితోనూ చెప్పకుండా వుండాలి. ఆ మాత్రం నీకు తెలియలేదంటే నాకాశ్చర్యంగా వుంది.' స్పీడుగా చెప్పేసాను, ఆ పోలీసాయన ఎక్కడ వచ్చేస్తాడో అన్న భయంతో.

వర్రీగా మొహం పెట్టుకుని చూసాడు పేషంటు.

ఏదో చెప్పబోయాడు.

ఈలోపల పోలీసాయన లోపలకి వచ్చాడు.

'నేనేమీ నా భార్య మీద కంప్లైంట్ చేయడంలేదు. నిజాయితీగా చెప్పాలని, అడిగినవన్నీ చెప్పాను. నేనేమీ చార్జెస్ ప్రెస్‌చేయడం లేదు. పోలీసులు ఈ విషయం పట్టించుకోనక్కరలేదు.' పేషంటు పోలీసాయనకి చెప్పాడు.

'చూడండి సర్! మీరు చెప్పినదంతా రికార్డు చేసుకున్నాను. రూల్స్ ప్రకారం మీ ఇంటికి వెళ్ళి, నీ భార్యతో మాట్లాడాలి. ఆ తరువాత నీ భార్యను అరెస్టు చేసినా చేయవచ్చు. నేనేమీ చేయలేను. రూల్స్ ప్రకారం ప్రవర్తించాలి నేను.' ఖచ్చితంగా చెప్పేసాడు.

'నో, నో, అలా జరగడానికి వీల్లేదు. మా ఇంటికి వెళ్ళొద్దు.' కంగారుగా అన్నాడుపేషంటు.

'ఎక్స్క్యూజ్‌మీ సర్! అది నా చేతుల్లో లేదు.' పోలీసాయన ఎంతో మర్యాదగా చెప్పేసాడు.

ఇంతలో డాక్టరూ, నర్సూ ఆ గదిలోకి వచ్చారు పేషంటుని చూడటానికి.

ఇంక నాకేం పనిలేదని బయటకి నడిచాను.

తెలివితక్కువగా ఆ పేషంటు తన కుటుంబంలో గొడవలు తెచ్చుకున్నాడని బాధేసింది. తల్లిని అరెస్టు చేస్తే ఆ చిన్న పిల్లలిద్దరూ ఎలా ఫీలవుతారో! వాళ్ళ ఫామిలీ ముక్కలవడం ఖాయం. ఈ పోలీసులు కుటుంబాలని కలపలేరుగానీ సులభంగా విరగ్గొట్టగలరు.

అలాగే విపరీతంగా ఫీలయిపోతూ నా పని చూసుకోసాగాను.

ఆ పేషంటు సంగతేమవుతుందోననీ, అతని కుటుంబం ఏమవుతుందోననీ గుబులు, గుబులుగానే వుంది.

కొంతసేపు పోయాక ఆ పోలీసాయన్ని కారిడార్‌లో చూసాను.

నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు.

కాస్త చనువుగా నవ్వాడుకదా అనిఅడిగేసాను.

'ఆ పేషంటు సంగతేమవుతుంది?'

'ఏముంది అవడానికి? వాళ్ళింటికి వెళ్ళి అతని భార్య స్టేట్‌మెంట్ తీసుకుంటాను. దాన్నిబట్టి అవసరమైతే అతని భార్యని అరెస్టు చేసి, స్టేషన్‌కి తీసుకు వెళ్తాను.' చాలా రొటీన్‌గా జవాబిచ్చాడు.

కొంచెం బాధగా చూసాను పోలీసాయన వైపు.

'పేషంటు కేసు వదిలెయ్యమంటున్నాడు కదా! అతనికి చార్జెస్ ప్రెస్ చెయ్యడం అస్సలిష్టంలేదు. మీరిలా చేస్తే అతని ఫామిలీ విచ్ఛిన్నం అవుతుంది కదా? అతని జీవితాన్ని ఎలాగూ బాగుచేయలేరు. ఎందుకు పాడుచేస్తారు? వద్దు మొర్రో అంటున్నాడు కదా! అతని విషయం వదిలేయచ్చుకదా!' చాలా వర్రీగా అన్నాను.

ఈసారి పోలీసాయన జాలిగా చూసాడు నా వైపు.

'ఆ పేషంటు చెప్పినదంతా పూర్తిగా నమ్మేసినట్లున్నావు పాపం. విచారిస్తేనేగానీ నిజం తెలియదు. ఈ రాష్ట్రంలో డొమెస్టిక్ వయొలెన్స్ చట్టం చాలా స్ట్రిక్ట్‌గా వుంటుంది. కొన్ని కేసుల్లో భర్తలు భార్యల్ని రెచ్చగొట్టి, చిన్నచిన్న దెబ్బలు తింటారు. వాటితో హాస్పిటల్‌కి వచ్చి సాక్ష్యం సృష్టించుకుంటారు. ఇలా ఒకటి, రెండుసార్లు జరగనిచ్చి, ఆఖరిసారి భార్యని చంపేస్తారు. ఆత్మరక్షణ అని సాకుచెప్పి, ఈ సృష్టించుకున్న సాక్ష్యాలని చూపిస్తారు. ఇటువంటి కేసులు ఎన్ని చూసామో! ఒకవేళ ఈ పేషంటు మంచివాడయినప్పటికీ, అతన్ని కాపాడ్డం మాబాధ్యత. ఈరోజున కోపంతో ఫోనుతో కొట్టిన మనిషి, ఇంకోరోజున ఇంకా కోపంతో కత్తితో పొడవచ్చు. డొమెస్టిక్ వయొలెన్స్ ఇక్కడితో ఆపెయ్యాలంటే వాళ్ళ ఇంటికెళ్ళి స్టేట్‌మెంట్ తీసుకోవాలి. అవసరమైతే అరెస్టు కూడా చెయ్యాలి.' తన అనుభవాన్నంతా రంగరించి చెప్పాడు పోలీసాయన.

ఆశ్చర్యంతో నోరు తెరిచాను.

అప్పటివరకూ పోలీసాయన మీద వున్న కోపం అంతాపోయింది. ఆయన చెప్పింది ఎంతో సబబనిపించింది. డొమెస్టిక్ వయొలెన్స్‌ని ఆపాలంటే ఈవిధంగా చేయక తప్పదనిపించింది.

పోలీసాయన వైపు అభిమానంగా చూసి, 'జ్యూస్ కావాలా?' అని అడిగాను.

ఆ క్షణంలో ఆయన నడుం దగ్గరున్న తుపాకీ సంగతే మర్చిపోయాను. ●

